Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143



WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్: 9440815774



Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 101 | Thursday 20.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 101 | గురువారం 20. 03. 2025 | వెల : రూ3/- | పేజీలు 4


మీరు పట్టుదల అంటే ఏంటో...

## చూపించారు

: ప్రధాని మోదీ

సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతరిక్షం నుంచి భూమిపైకి సునీత, బుచ్ విల్మోర్ వ్యోమగాములను ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ట్వీట్ వారి జీవితం ఎంతో మందికి స్ఫూర్తి అని కొనియాడిన ప్రధాని



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతరిక్ష కేంద్రం నుంచి భూమిపైకి తిరిగొచ్చిన సునీతా విలియమ్స్, ఇతర వ్యోమగాములను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. పట్టుదల అంటే ఏంటో చూపించారని, ఎంతో మందికి స్ఫూర్తి అంటూ వ్యోమగాములను కొనియాడుతూ ప్రధాని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్టు పెట్టారు.

మిగతా 2 లో

పేదల బడ్జెట్...

## ప్రవేశపెట్టాం

: మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని అన్నారు. బడ్జెట్‌లో విద్యార్థుల కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని ఆయన తెలిపారు. ఎకరాకు రైతు భరోసా రూ. 12 వేలు, రైతు కూలీలకు ఇందిరమ్మ రైతు భరోసా కింద రూ. 12 వేలు, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుమారు 57 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. త్వరలో గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3 అభ్యర్థులకు నియామక

మిగతా 2 లో

ఏపీకి పెట్టుబడులతోమీవంతు...

# సహకరించండి

బిల్‌గేట్స్‌తో ముగిసిన చంద్రబాబు భేటీ





అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించటం కోసం రేయింబవళ్లు కష్టపడుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీల అధిపతులను కలుస్తున్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరుతున్నారు. ఈ నే

మిగతా 2 లో

సునీత గురించి తామేమీ...

## ఆందోళన చెందలేదు

: కుటుంబ సభ్యులు

సునీతా విలియమ్స్..అంతరిక్షమే ఇల్లు... ధైర్యమే ఊపిరి!

9 నెలలుగా అంతరిక్షంలోనే ఉన్న సునీతా విలియమ్స్ ఇన్నాళ్లకు భూమికి తిరిగి రాక

ఆమెకు ఏది ఇష్టమైతే తమకు కూడా అదే ఇష్టమని వెల్లడి



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : అనూహ్య రీతిలో అంతరిక్ష కేంద్రంలో 9 నెలల పాటు చిక్కుకుపోయి, ఇన్నాళ్లకు భూమ్మీదకు అడుగుపెట్టిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ పేరు ఎక్కడా చూసినా మార్మోగిపోతోంది. ఎంతో గుండె నిబ్బరంతో ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్-ఎస్)లో గడిపిన తీరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అనడంలో సందేహం లేదు. ఐఎస్ఎస్ నుంచి గతేడాదే తిరిగి రావాల్సి ఉన్నా, వ్యోమనౌకలో సాంకేతిక లోపంతో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ రోదసిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. తాజాగా క్రూ-10 రాకతో వారు ఐఎస్ఎస్ నుంచి వీడ్కోలు తీసుకుని భూమి పైకి చేరుకున్నారు. కాగా సునీత గురించి ఆమె కుటుంబ సభ్యులు ఏమంటున్నారో

మిగతా 2 లో

ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు...

## సభ ఆమోదం

ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తాం: మంత్రి లోకేశ్

శాసనసభలో వెల్లడించిన విద్య, ఐటీ శాఖల మంత్రి

రాష్ట్రంలో సెంచూరియన్ యూనివర్సిటీ తీసుకువచ్చినట్లు వెల్లడి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ రెండో సవరణ బిల్లు-2025ను మంత్రి శాసనసభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... “రాష్ట్రంలో

మిగతా 2 లో



మీడియా ముందు రంకెలు వేయడం కాదు.. అంకెలు ఎందుకు...

# ఆగమాయ్యాయో చెప్పు

ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి.. సీఎంపై కేటీఆర్ సెటైర్లు

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : తొండ ముదిరితే ఊసరవెల్లి అయితదని పెద్దలు చెబుతుంటారు.. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితడని ఈ బడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఒక్క మాటలో ఈ బడ్జెట్ గురించి చెప్పాలంటే.. ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌లా ఉంది. నీ తెలివి తక్కువ తనం వల్ల, నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయింది. మీడియా ముందు రంకెలు వేయడం కాదు.. అంకెలు ఎందుకు ఆగమాయ్యాయో చెప్పు. గత బడ్జెట్ సందర్భంగా చెప్పినట్లు మీ బడ్జెట్ అంచనాలకు ఎందుకు చేరుకోలేకపోయింది. నమ్మి ఓట్లేసిన పాపానికి 4 కోట్ల మందిని ముంచిన బడ్జెట్

మిగతా 2 లో



అరాచక శక్తులను...

# అణిచివేస్తాం..

పెద్దిరెడ్డికి బుద్దావెంకన్న స్ట్రాంగ్ వార్నింగ్

విజయవాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : మాజీ మంత్రి పెది ్దరెడ్డి రామచంద్రారెడ్డిపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బుద్దా వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం అని గతంలో ఉండేదని.. కానీ జగన్ జమానాలో మద్యం తాగితే ప్రాణాలు కోల్పోయేలా చేశారని విమర్శలు చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామ

మిగతా 2 లో



రాయలసీమకు మరిన్ని...

# నీళ్లు అందిస్తాం

హంద్రీనీవాపై వైసీపీ రచ్చ.. మంత్రి ధీటైన సమాధానం

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు, ప్రవాహం పెంచడంపై శాసన మండలిలో వాడీవేడీ చర్చ జరిగింది. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేయడాన్ని ఆపాలని వైసీపీ సభ్యుడు శివరామిరెడ్డి కోరారు. లైనింగ్ చేస్తే భూగర్భజలాలు పెరగవని, ప్రవాహం పెంచే అవకాశం ఉందన్న సభ్యుడు

మిగతా 2 లో



# సంపాదకీయం

## అస్ట్రోనట్స్ సేఫ్ ల్యాండ్

## పూర్తిగా కోలుకోవడానికి 6 నెలల టైమ్

వ్యోమనౌక మొరాయించడంతో తొమ్మిది నెలలుగా అంతరిక్షంలోనే ఉండిపోయిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు భువిపై సురక్షితంగా అడుగుపెట్టారు.. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి మంగళవారం తిరుగుప్రయాణం అయిన సునీతా విలియమ్స్, విల్మోర్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27కి ఫ్లోరిడా తీరంలో సేఫ్ గా ల్యాండ్ అయ్యారు.. డ్రాగన్ వ్యోమనౌక సముద్ర తీరంలో ల్యాండ్ అవ్వగానే.. సహాయ బృందాలు రంగంలోకి దిగి.. క్రూ డ్రాగన్‌ను వెలికితీస్తాయి. ఆ తర్వాత ఆస్ట్రోనాట్‌లను స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్' క్యాప్సూల్ నుంచి బయటకు తీసుకొచ్చారు.. ఊహించని సవాళ్లు, చారిత్రాత్మక క్షణాలతో నిండిన ఈ మిషన్ సేఫ్ గా ముగియడంతో ఆనందం వెల్లివిరిసింది. 286 రోజుల తర్వాత సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లు సురక్షితంగా పుడమిని చేరినట్లు నాసా ప్రకటించింది..ఫ్లోరిడా తీరంలో స్పేస్‌ఎక్స్ క్రూ-9 మిషన్ భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించిన క్షణాలను నాసా టీ, యూట్యూబ్, ఔరాం+లో లైవ్ ప్రసారం చేసింది.. దివి నుంచి భువికి చేరిన వారిలో సునీతా విలియమ్స్, విల్మోర్‌తో పాటు స్పేస్‌ఎక్స్ క్రూ-9 వ్యోమగామి నిక్ హేగ్, రష్యన్ వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ ఉన్నారు.వ్యోమగాముల జీవితం ఓ సాహసం. అంతరిక్షంలోకి వెళ్లడమే ఓ సాహసం అయితే అక్కడ వాతావరణాన్ని తట్టుకుని నిలబడటం, తిరిగి భూమిపైకి వచ్చిన తర్వాత ఈ వాతావరణంలోకి మారే సమయంలో వారి జీవన గమనం అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటుంది.అలాంటిది పలుమార్లు అంతరిక్షయానం చేసిన సునీతా విలియమ్స్ గతంలో చాలా సార్లు ఇలాంటి అనుభవాలను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి ఆమెకి మరో పెద్ద సవాల్ ఎదురైంది. దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలో అక్కడి వాతావరణానికి అలవాటు పడిన ఆమె రేపటి నుంచి భూమి వాతావరణానికి అడ్జస్ట్ కావాల్సి ఉంటుంది.వ్యోమగాములు శారీరకంగా కొన్ని సవాళ్లను ఎదుర్కొంటారు, మానసికంగా కూడా మరిన్ని సవాళ్లను వారు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి తక్కువ. స్పేస్ లో వారు ఉన్న ఆ కాస్త ప్లేస్ లోనే ఒంటరిగా జీవితం గడపాల్సి ఉంటుంది. అంతరిక్ష కేంద్రంలో మరో వ్యక్తి తోడు ఉన్నా కూడా ఇరుగు పొరుగుతో మాట్లాడినట్టు అక్కడ కబుర్లు, కాలక్షేపానికి చోటు ఉండదు. అందుకే నిరంతరం తమ శరీరాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ తిరిగి భూమిపైకి వెళ్లే సమయం వరకు ఆరోగ్యంగా ఉంటూ సమయం కోసం వేచి చూస్తుంటారు వ్యోమగాములు. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి తక్కువ కాబట్టి.. దానికి తగ్గట్టే వారి జీవన విధానం మారిపోతుంది. ముఖ్యంగా గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం వల్ల మానవ శరీరంలో కండరాలు ఇబ్బంది పడతాయి. వాస్తవంగా గురుత్వాకర్షణ శక్తి ఉంటే కండరాలకు పని ఉంటుంది. అది లేకపోవడం వల్ల కండరాలు ఎక్కువ కష్టపడాల్సిన అవసరం లేదు. ఒకరకంగా ఈ స్థితి కండరాల క్షీణతకు దారి తీస్తుంది.అంతరిక్షంలో మానవ శరీరంలోని ఎముకలు తమ ద్రవ్యరాశిని 1 నుంచి 2 శాతం కోల్పోతాయి. ఆస్టియో పోరోసిస్ లాగా ఎముకలకు నష్టం జరుగుతుంది. ఎముకల సాంద్రత తగ్గుతుంది, వాటిల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. భూమిపైకి వచ్చిన తర్వాత ఆ నష్టం నుంచి కోలుకోడానికి వారికి సరైన వ్యాయామం అవసరం. పూర్తిగా కోలుకోడానికి కనీసం 2 నుంచి 3 నెలల సమయం పడుతుందని అంచనా.అంతరిక్షం నుంచి భూమిపైకి వచ్చిన తర్వాత హృదయ స్పందనలు, రక్త సరఫరా వంటి వాటిల్లో కూడా సమతుల్యత లోపించే ప్రమాదం ఉంది. భూమిపైకి వచ్చిన తర్వాత వ్యోమగాములకు తరతిరగడం వంటివి సహజం. దీన్ని నివారించేందుకు వారికి రోజుల తరబడి బెడ్ రెస్ట్ అవసరమని చెబుతుంటారు వైద్యులు. తిరిగి వారు సాధారణంగా నడవడం, ఇతర పనులు చేసుకోడానికి తగిన సమయం ఇస్తారు.అంతరిక్ష కేంద్రంలో రక్తంతోపాటు శరీరంలోని ఇతర ద్రవాల ప్రవాహం ఎక్కువగా తలవైపునకు ఉంటుంది. అందుకే వ్యోమగాములకు ముఖాల వాపు సహజ లక్షణం. వారు భూమిపైకి తిరిగి వచ్చిన తర్వాత రక్తపోటులో అసహజ మార్పులు కనిపించవచ్చు. వారు పడుకొని ఉంటే రక్తపోటు సాధారణ స్థాయిలో ఉంటుంది. నిలబడితే మాత్రం రక్తపోటు తక్కువగా ఉండే ప్రమాదం ఉంది.అంతరిక్ష కేంద్రంలో బ్యాక్టీరియా, వైరస్‌లకు చోటు ఉండదు కాబట్టి శరీరంలో ఉండే రోగ నిరోధక వ్యవస్థ కూడా పూర్తిగా చప్పబడి ఉంటుంది. భూమిపైకి తిరిగి వచ్చిన తర్వాత దాని అవసరం ఎక్కువగా ఉంటుంది. అయితే అప్పటికే బలహీన పడిన రోగనిరోధక వ్యవస్థ తిరిగి పూర్తిస్థాయిలో పనిచేయడానికి, శరీరానికి రక్షణ కవచంలా ఉండటానికి ఎక్కువ సమయం పట్టొచ్చు. అంతరిక్షంలో రేడియేషన్ ప్రభావానికి ఎక్కువగా శరీరం గురవుతుంది. భూమిపైకి తిరిగొచ్చిన తర్వాత ఆ ప్రభావం పూర్తిగా ఉండదు కాబట్టి దానికి తగినట్టు శరీరం సర్దుబాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.వ్యోమగాములకు దృష్టి సమస్యలు కూడా సహజం. అంతరిక్షంలో ఎక్కువరోజులు గడిపి భూమిపైకి వచ్చిన తర్వాత కంటి సమస్యలు ఎదురవుతాయి. ఇవి దీర్ఘకాలికంగా వారిని ఇబ్బంది పెట్టే అవకాశముంది. స్పేస్ ఫ్లైట్ అసోసియేటెడ్ న్యూరో ఓక్యులర్ సిండ్రోమ్ వ్యోమగాముల్ని ఇబ్బంది పెడుతుంది.శారీరక సమస్యలు ఒక ఎత్తు అయితే, మానసిక సమస్యలు మరో ఎత్తు. అంతరిక్షంలో నెలల తరబడి ఒంటరిగా జీవనం సాగించిన వ్యోమగాములు, భూమిపైకి చేరుకోగానే రోజువారీ జీవితాన్ని గడిపేందుకు ఇబ్బంది పడతారు. ఈ సమయంలో వారికి మానసిక వైద్య నిపుణుల మద్దతు, కౌన్సెలింగ్ అవసరం. కుటుంబ సభ్యులు కూడా వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని వారికి సహకరించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో తీవ్ర ఒత్తిడి, నిరాశకు వ్యోమగాములు గురవుతారని అంచనా. ఆ ఒత్తిడిని కూడా వారు జయించాల్సి ఉంటుంది.

## సునీత గురించి తామేమీ...

ఓసారి చూద్దాం. సునీతా విలియమ్స్‌కు అంతరిక్ష కేంద్రమే ఒక ఇల్లు వంటిదని, ధైర్యమే ఆమెకు ఊపిరి అని చెబుతున్నారు. ఆమె తమకు ఇన్నాళ్ల పాటు దూరంగా ఉన్నప్పటికీ, తనకు ఇష్టమైన పని చేస్తుండడంతో తామేమీ ఆందోళన చెందడంలేదని అంటున్నారు. ఆమెకు ఏది ఇష్టమైతే తమకు కూడా అదే ఇష్టమని స్పష్టం చేశారు.సునీత తండ్రి దీపక్ పాండ్యా, తల్లి ఉర్సులిన్ బోనీ పాండ్యా. వీరికి ముగ్గురు సంతానం కాగా, సునీత చిన్నది. ఆమెకు జె. థామస్ అనే అన్నయ్య, దీనా ఆనంద్ అనే అక్క ఉన్నారు. అమెరికాలో జన్మించిన సునీత అక్కడే చదువుకుంది. ఆ తరువాత ఆమె తండ్రి దీపక్ పాండ్యా ప్రోత్సాహంతో అమెరికన్ నేవీలో చేరారు. నేవీలో పనిచేస్తున్న సమయంలోనే మైఖేల్ జె. విలియమ్స్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి అది స్నేహంగా మారింది. వీరిద్దరూ వివాహం చేసుకుని 20 ఏళ్లుగా కలిసి జీవిస్తున్నారు. టెక్సాస్‌లోని హ్యూస్టన్ శివారులో వారు నివాసం ఉంటున్నారు. పిల్లలు లేని ఈ జంట ఒక అమ్మాయిని దత్తత తీసుకోవాలని అనుకుంటున్నారు. సునీతకు గార్బీ అనే పెంపుడు కుక్క అంటే చాలా ఇష్టం. ఆమె తరచుగా గార్బీతో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటారు. 2006లో మొదటిసారిగా ఆమె తనతో పాటు భగవద్గీతను అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళ్లారు. 2012లో ఓం చిహ్నం తీసుకెళ్లినట్టు చెప్పిన ఆమె, గణేశ్ విగ్రహాన్ని కూడా ఎప్పుడూ తనతో ఉంచుకుంటారట. సునీత మత విశ్వాసాలకు భర్త విలియమ్స్ మద్దతు ఇస్తారు.సునీత తల్లి బోనీ పాండ్యా మాట్లాడుతూ, సునీత ఎక్కువ కాలం అంతరిక్షంలో ఉండటం గురించి తమకు ఎలాంటి ఆందోళన లేదని చెప్పారు. ఆమె తన విధి నిర్వహణలో భాగంగా కష్టపడి పనిచేస్తుందని అన్నారు. కూతురు తమ నుంచి చాలా కాలం దూరంగా ఉండటం మొదట్లో కష్టంగా ఉండేదని, కానీ ఇప్పుడు అలవాటైందని ఆమె తెలిపారు. సునీత తనకిష్టమైన పని చేస్తుంటే తాను బాధపడాల్సిన అవసరం లేదని, ఆమె తన ప్రయత్నాల్లో సంతోషంగా ఉందని బోనీ పాండ్యా అన్నారు. సునీతకు ప్రత్యేకించి ఎటువంటి సలహాలు ఇవ్వనని, ఎందుకంటే ఆమెకు ఏం చేయాలో బాగా తెలుసని ఆమె చెప్పారు.

## ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు...

సెంచూరియన్ యూనివర్సిటీ తీసుకురావడం జరిగింది. సాంకేతిక అంశాల్లో ఇబ్బందులు తలెత్తాయి. ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఉన్నాం. గ్రీన్ ఫీల్డ్ గురించి ఇప్పటికే చర్చించాం. బ్రౌన్ ఫీల్డ్ కింద ప్రైవేటు యూనివర్సిటీగా గుర్తించాలని అనుకున్నప్పుడు... కేంద్ర, రాష్ట్ర నిబంధనల ప్రకారం వీవీఐటీ ప్రైవేటు యూనివర్సిటీగా గుర్తించాలని కోరడం జరిగింది. వారికి 50 ఎకరాల భూమి ఉంది. 4,75,278 చ.అడుగుల బిల్టప్ ఏరియా ఉంది. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇంక్యుబేటర్ సెంటర్స్ ఉన్నాయి. 11 యూజీ, పీజీ కోర్సులు ఉన్నాయి. సుమారు 700 మంది సిబ్బంది ఉన్నారు. 9,200 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సొసైటీ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉంది. వీవీఐటీని వీవీఐటీయూగా మార్చాలని కోరారు. అది కూడా 2016 యాక్ట్ కింద కన్వర్ట్ చేయాలని కోరారు. ఈ యాక్ట్ గ్రీన్ ఫీల్డ్ అంటే కొత్త యూనివర్సిటీ, మరొకటి బ్రౌన్ ఫీల్డ్.. అంటే కన్వర్షన్. వీవీఐటీ కన్వెర్షన్ కింద బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీ గా గుర్తించాలని కోరడం జరిగింది. యూనివర్సిటీ ఎప్పుడు వచ్చినా చట్టసభల్లో యాక్ట్ కింద సవరణ చేసి యూనివర్సిటీ పేరును ఇంక్లూడ్ చేయాల్సిన అవసరం ఉంది" అని మంత్రి లోకేశ్ అన్నారు.

## రాయలసీమకు మరిన్ని...

తెలిపారు. హంద్రీనీవా ప్రవాహాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాలని శివరామిరెడ్డి కోరారు. అయితే హంద్రీనీవాపై వైసీపీ సభ్యులు అవాస్తవాలు చెప్పి సభను తప్పుదో పట్టిస్తున్నారన్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ ఫైర్ అయ్యారు. హంద్రీనీవా ఎన్టీఆర్ కృషి ఫలితమని, ఒక రోజైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు. ఇక... వైసీపీ సభ్యుల ఆరోపణలకు జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ధీటుగా సమాధానం చెప్పారు. హంద్రీనీవా ద్వారా 2025 జూన్ కల్లా రెట్టింపు జలాలు ప్రవహించేలా సీఎం చర్యలు తీసుకున్నారన్నారు. హంద్రీనీవా ప్రవాహాన్ని 2200 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెంచాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని తెలిపారు. ఏ ప్రాజెక్టుకూ కేటాయించని రీతిలో బడ్జెట్‌లో రూ.3240 కోట్లు హంద్రీనీవాకు కూటమి ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు. ప్రవాహం పెంచి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని పలు ప్రాంతాలకు నీటిని అదనంగా తరలిస్తామన్నారు. హంద్రీనీవా కాలువ 216 నుంచి 400 కిలోమీటర్ల వరకు 195 చెరువులు అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటి ప్రవాహాన్ని తెచ్చిన తర్వాత రాయలసీమకు మరిన్ని నీళ్లు అందిస్తామన్నారు. భవిష్యత్తులో హంద్రీనీవా ద్వారా నీటి ప్రవాహాన్నిదశలవారీగా గణనీయంగా పెంచాలని సీఎం నిర్ణయించారని చెప్పారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ వద్దని చెబుతోన్న వైసీపీ సభ్యులు... గతంలో జగన్ ఆదేశాలిచ్చినపుడు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో ఒక్క క్యూసెక్కు ప్రవాహాన్నీ ఎందుకు పెంచలేదని మంత్రి నిలదీశారు. గత ఐదేళ్లలో హంద్రీనీవా పనులను రూపాయి కూడా ఎందుకు ఖర్చు చేయాలని అడిగారు. ప్రవాహం పెంచేందుకు చంద్రబాబు మల్యాల వద్ద మోటార్లు పెడితే జగన్ హయాంలో ఎందుకు వినియోగించుకోలేదంటూ ఫైర్ అయ్యారు. ఓ వైసీపీ నేత కుప్పం నుంచి చిత్తూరుకు పైపుల ద్వారా నీరు తీసుకువెళ్తుంటే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని అడిగారు. హంద్రీనీవా కెనాల్‌ను లైనింగ్ చేస్తే .. రాయలసీమ సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## అరాచక శక్తులను...

మిథున్ రెడ్డిలు కొత్త స్కాం చేశారని ఆరోపణలు చేశారు. మద్యం అడ్డు పెట్టుకుని వైసీపీ నేతలు వేలమంది ప్రాణాలు తీశారని విమర్శించారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్మును వాటాలుగా ముగ్గురూ పంచుకున్నారని ఆరోపించారు. ముందస్తు బెయిల్ కోసం మిథున్ రెడ్డి కోర్టులో పిటిషన్ వేశారని అన్నారు. చిత్రగుప్తుడు కూడా రాయలేని అన్నిపాపాలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి చేశారని మండిపడ్డారు. మద్యం, మైనింగ్‌లో భారీగా దోచుకున్నారని ఆరోపించారు. ఈ డబ్బుతోనే కుప్పంలో చంద్రబాబును గెలవనివ్వమని రంకెలు వేశారని ధ్వజమెత్తారు. మీపాపపు సొమ్ము వద్దని కుప్పం ప్రజలు చంద్రబాబుకే పట్టం కట్టారని అన్నారు. పుంగనూరులో చంద్రబాబును అడ్డుకుని దాడి చేయించారని మండిపడ్డారు. నేషనల్ క్రైం రికార్డు ప్రకారం ఏపీలో 2019-24 మధ్య మద్యం ద్వారా వందశాతం మరణాలు సంభవించాయని రిపోర్డు ఇచ్చిందని అన్నారు. ఈ పాపం పెద్దిరెడ్డి కుటుంబానిది కాదా అని ప్రశ్నించారు. ఇన్ని ప్రాణాలు తీసి మధ్యంతర బెయిల్ కోసం కోర్టుకు వెళ్లారని చెప్పారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చేయని స్కాం లేదు, చేయని కబ్జా లేదన్నారు. కోర్టులో ప్రభుత్వ న్యాయవాదులు గట్టిగా వాదనలు వినిపించి బెయిల్ రాకుండా చూడాలని బుద్దా వెంకన్నకోరారు.

**అరాచక శక్తులను అణచివేస్తాం.. :**

'చంద్రబాబు మీలాగా దౌర్జన్యాలు చేయిస్తే... మీరు అసలు రోడ్ల మీదకు వచ్చేవారా. అరాచక శక్తులను చంద్రబాబు అణచి వేస్తారు.. మీలాగా దాడులు చేయించరు. పుంగనూరులో మా టీడీపీ కార్యకర్తను చంపించారు... చంద్రబాబు, లోకేష్ మిమ్మలను వదలరు. ఈహత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి. గత జగన్ ప్రభుత్వంలో వేలకోట్ల రూపాయల మద్యం కుంభకోణం చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దమ్ముంటే నేను అడిగే వాటికి సమాధానం చెప్పాలి. ప్రజల సొమ్ము దోచుకున్న మీరు ప్రజా నాయకుడిని ఓడిస్తా అంటూ ప్రగల్భాలు పలుకుతారా. వైసీపీ నేతలతో సోషల్ మీడియాలో చంద్రబాబు, లోకేష్‌లపై నీచంగా ట్రోల్ చేయిస్తారా. అవినీతి సొమ్ముతో అడ్డగోలుగా వ్యవహరిస్తే... మీ అందరి సంగతి తేలుస్తాం. అయ్యప్ప సాక్షిగా మద్యం కుంభకోణంలో మా పాత్ర లేదని చెప్పే ధైర్యం ఉందా. ప్రతి సంవత్సరం మాల వేయడం కాదు...అవినీతి చేయకుండా .. నిజాయితీగా బతకాలి. ఈ మద్యం కుంభకోణం గురించి ప్రజలకు కూడా వాస్తవాలు తెలియాలి. రేపు తండ్రీ, కొడుకులు అరెస్టు అయితే కూటమి ప్రభుత్వంపై గగ్గోలు పెడతారు. తప్పు చేసిన ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదు. మేము తప్పు చేయకపోయినా మా వాళ్లను అక్రమంగా అరెస్టు చేశారు. నా ఛాలెంజ్‌కు పెద్దిరెడ్డి కుటుంబం స్పందించాలి. మద్యం అవినీతి సొమ్ముతో మాకు సంబంధం లేదని ప్రమాణం చేయాలి. ప్రమాణం చేయకుండా చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తే చూస్తూ ఊరుకోం. ప్రజలు కూడా వారి అవినీతి గురించి తెలుసుకుని, వారు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టండి' అని బుద్దా వెంకన్న కోరారు.

# రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ

కాకినాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** ::ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికకు ఏపీ క్యాబినెట్ అమోద ముద్ర వేసింది. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం మొత్తం యూనిట్‌గా రిజర్వేషన్లను అమలు చేయనున్నారుతాజా నిర్ణయం ప్రకారం ఏపీలో ఏ, బీ, సీ కేటగిరీలుగా రిజర్వేషన్ అమలు చేస్తారు. ఏ క్యాటగిరీలో రెల్లి, ఉపకులాలకు 1%, మాల, ఉపకులాలకు 7.5 శాతం, మాదిగ, ఉపకులాలకు 6.5%. రిజర్వేషన్లకు మంత్రుల సంఘం సిఫారసుల్ని క్యాబినెట్ అమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయంపై మార్చి 20న అసెంబ్లీలో చర్చించి ఆ తీర్మానాన్నిజాతీయ ఎస్సీ కమిషన్‌కు పంపుతారు.ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేయాలని భావించినా 2021 జనాభా లెక్కలు జరగక పోవడంతో 2011 జనాభా లెక్కల ప్రకారమే వర్గీకరణ చేపడతారు. తాజా అంచనాలు లేకుండా జిల్లా యూనిట్ అమలు చేయడంపై అభ్యంతరాల నేపథ్యంలో రాష్ట్రం మొత్తాన్ని యూనిట్‌గా పరిగణిస్తారు. ఉమ్మడి జిల్లాలను 26 జిల్లాలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఏపీలో కొత్త జిల్లాల్లో ఎస్సీల జనాభాపై కచ్చితమైన సమాచారం లేనందున రాష్ట్రం యూనిట్ గా అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. 2026 జనాభా గణన తర్వాత వర్గీకరణను జిల్లా యూనిట్ అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తారు. ఏ- కేటగిరీలో రెల్లి, ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్.. బీ కేటగిరీలో మాదిగ, ఉపకులాలకు 6.5 శాతం.. సీ కేట గిరీలో మాల, ఉపకులాలకు 7.5 శాతం రిజ ర్వేషను ప్రతిపాదిస్తూ రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభు త్వానికి ప్రతిపాదించింది.ఏపీలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపులో జాప్యం, తదితర అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాత రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఏక సభ్య కమిషన్ నివేదికపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించను న్నారు. బేడ, బుడగ జంగాలను రెల్లి కేటగిరీ కింద చేర్చే అంశంపై కూడా అసెంబ్లీలో చర్చి స్తారు.ఏపీలో ఎస్సీ వర్గీకరణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. మాల ఉపకులాలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి. జిల్లా యూనిట్ అమలు చేయాలని కొందరు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి సూచించారు. రాజీవ్‌రంజన్ మిశ్రా నివేదిక, ఆ నివేదికపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికలపై కేబినెట్‌లో చర్చించారు.గత ఏడాది నవంబరు 15న ఏకసభ్య కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం 2 నెలల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా రాష్ట్రంలోని ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. 13 ఉమ్మడి జిల్లాల్లో ఎస్సీ సంఘాలు, మేధావులు, ఉద్యోగుల నుంచి వినతులు తీసుకున్నారు. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల నేతలు, ఉద్యోగ సంఘాలతో చర్చించారు. కొన్నిచోట్ల వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు వినతిపత్రాలు అందించారు.ఏడాది నవంబరు 7న సచివాలయంలో 23 మంది కూటమి దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతోపాటు ఎన్నికల హామీపై కూడా వారితో చర్చించారు. జనాభా దామాషా పద్ధతిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ అమలు చేస్తామని అప్పట్లో చంద్రబాబు ప్రకటించారుఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్.. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా చేపట్టిన ఎస్సీ జనాభా గణనను ప్రాతిపదికగా చేసుకుంది. ఆ సర్వే సమగ్రంగా జరగలేదని ఫిర్యాదులు వచ్చాయి. సర్వేను తిరిగి చేపట్టాలని ఎస్సీ మాల వర్గం డిమాండ్ చేస్తోంది.కొత్తగా పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ల పరిమితిని పెంచడం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సర్వేను పరిగణనలోకి తీసుకోకుండా సమగ్రంగా సర్వే చేపట్టాలని కోరుతున్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో కాకుండా కమిషన్ ఉమ్మడి 13 జిల్లాల్లోనే పర్యటించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## ఫ్లాట్‌లో సోదాలు.. రూ.80 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు, లగ్జరీ వాచీలు స్వాధీనం



అహ్మదాబాద్ :
డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తాళం వేసి ఉన్న ఫ్లాట్‌లో సోదా చేశారు. రూ.80 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు, లగ్జరీ వాచీలు చూసి కంగుతున్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. మార్చి 17న పాల్డి ప్రాంతంలో లాక్ వేసి ఉన్న ఒక నివాసిత ఫ్లాట్‌లో గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులతో కలిసి డీఆర్ఐ అధికారులు సోదాలు నిర్వహించారు. 88 కేజీల బరువున్న బంగారు కడ్డీలు, విలువైన వజ్రాలతో కూడిన 19.66 కేజీల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.80 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కాగా, స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీలపై విదేశీ గుర్తులు ఉన్నాయని డీఆర్ఐ అధికారులు తెలిపారు. దీంతో దేశంలోకి అక్రమంగా రవాణా చేసినట్లు అనుమానిస్తున్నారు. వజ్రాలు పొదిగిన పాటెక్ ఫిలిప్ వాచ్, జాకబ్ అండ్ కో టైమ్‌పీస్, ఫ్రాంక్ ముల్లర్ వాచ్‌తో సహా 11 లగ్జరీ వాచీలు కూడా సోదాల్లో బయటపడినట్లు అధికారులు చెప్పారు. అలాగే రూ.1.37 కోట్ల నగదు కూడా ఆ ఫ్లాట్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో గుజరాత్‌లోని ఫ్లాట్‌లో రూ.80 కోట్ల విలువైన బంగారు కడ్డీలు, నగలు, లగ్జరీ వాచీలు బయటపడటం సంచలనం రేపింది. అయితే ఈ ఫ్లాట్ ఎవరిది అన్న వివరాలు తెలియలేదు.

## మీరు పట్టుదల అంటే ఏంటో...

భూమి చాలా మిస్ అయింది. సునీతా విలియమ్స్, క్రూ9 వ్యోమగాములు మరోసారి పట్టుదల అంటే ఏమిటో మనకు చూపించారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి ఎప్పటికీ స్ఫూర్తినిస్తుంది. అంతరిక్ష అన్వేషణ అంటే మానవ సామర్థ్యాన్ని మించి సరిహద్దుల్ని దాటుకుని వెళ్లడం, కలల్ని నిజం చేసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. సునీత ఒక ఐకాన్. తన కెరీర్ అంతటా స్ఫూర్తిని ప్రదర్శించారు. వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారందరినీ చూసి మేము చాలా గర్వపడుతున్నాం. కచ్చితత్వం, అభిరుచి, సాంకేతికత, పట్టుదల కలిస్తే ఏం జరుగుతుందో వారు చూపించారు"అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

## ఏపీకి పెట్టుబడులతోమీవంతు...

బుధవారం మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలో వీరిద్దరూ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్, ఏపీ ప్రభుత్వం మధ్య కీలక ఒప్పందాలు జరగాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ ఏపీకి సహకారం అందించడానికి ఒప్పుకుంది. వీటికి సంబంధించిన అంశాలపై గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు.


**గేట్స్ నో అన్నా చంద్రబాబు నిరాశ పడలేదు.. :**

దాదాపు 30 ఏళ్ల క్రితం తొలిసారి చంద్రబాబు నాయుడు, బిల్‌గేట్స్‌ను కలవాలనుకున్నారు. అందుకు బిల్‌గేట్స్ కార్యాలయం నుంచి నో అనే సమాధానం వచ్చింది. అయినా చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడిలాగా మళ్లీ మళ్లీ ప్రయత్నించారు. అప్పుడు ఓ చిన్న అవకాశం దొరికింది. బిల్‌గేట్స్ కేవలం 10 నిమిషాలు మాత్రమే మాట్లాడటానికి అవకాశం ఇచ్చారు. చంద్రబాబు నిరాశపడలేదు. దాన్నో అద్భుతమైన అవకాశంగా మార్చుకుని ఏపీ మీద తనకున్న ప్రేమను, అభివృద్ధి చేయాలనే ఆకాంక్షను, ప్రణాళికలను బిల్‌గేట్స్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌తో బిల్‌గేట్స్ ముగ్ధుడయ్యాడు. 10 నిమిషాల సమావేశం 45 నిమిషాల వరకు సాగింది.

## మీడియా ముందు ....

ఇది. పదేండ్ల ప్రగతి రథచక్రానికి పంక్చర్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇది. రేవంత్ రెడ్డి అసమర్థతకు, చేతగానితనానికి నిలువుటద్దం ఈ బడ్జెట్. వీరి అసమర్థతత, చేతకాని తనం వల్ల ఆకాశం నుంచి పాతాళం వైపు ఆర్థిక వ్యవస్థ పోతున్నదంటే కచ్చితంగా బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలి. కేసీఆర్ ఏడాదికి రూ. 40 వేల కోట్ల అప్పు జేస్తే రంకెలు వేశారు. కానీ ఇవాళ ఒక్క ఏడాదికి లక్షా 60 వేల కోట్లు అప్పు చేసి కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఒక్క ఇటుక పేర్చలేదు. ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే లక్షల కోట్ల అప్పు టార్గెట్ కనబడుతున్నట్టు ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. తొండ ముదిరితే ఊరసవెల్లి అవుతదని పెద్దలు చెబుతారు. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితదని ఈబడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతుంది. సంక్షేమానికి సమాధి.. అభివృద్ధికి అడ్రస్ గల్లంతు.. ప్రజలకు ఇచ్చిన హామీలకు ఘోరీ కట్టి.. పార్టీ కార్యకర్తలకు మాత్రం వీళ్ల అబ్బ సొత్తు.. పప్పుబెల్లం లాగా 6 వేల కోట్లు పంచి పెడుతారట. కార్యకర్తలకు ఇస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి ఈ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరు. పప్పుబెల్లంలాగా పంచి పెడుతామంటే.. అది యువ వికాసం కాదు కాంగ్రెస్ వికాసం అయితది అని కేటీఆర్ మండిపడ్డారు.


## పేదల బడ్జెట్...



పత్రాలు ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన వివరించారు. యువ వికాసం పథకం కింద లబ్ధిదారులకు రూ. 4 లక్షల ఆర్థిక సాయం చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏడాది రెండు చీరలు ఇస్తామని తెలిపారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను ప్రభుత్వం ఆదుకుంటోందని ఆయన వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థ భ్రష్టు పట్టిందని విమర్శించారు.

## దాంట్ల.సుబ్రమణ్యరెడ్డి భార్య కాంతమ్మ మృతి దేహానికి .....

### నివాళులర్పించిన కుష్బూ మోహన్ మురళి



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: వెదురుకుప్ప మండలం చవటగుంట గ్రామానికి చెందిన దాంట్ల. సుబ్రమణ్య రెడ్డి భార్య కాంతమ్మ (55) అనారోగ్యంతో బుధవారం రోజు ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెదురుకుప్పం టిడిపి క్లస్టర్ ఇంచార్జి మాజీ మండల అధ్యక్షులు మోహన్ మురళి సతీమణి కుష్బూ మోహన్ మురళి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్తిక సహాయం అందజేశారు నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ బోడిరెడ్డి. హనుమంత్ రెడ్డి,డాక్టర్. దయాకర్ రెడ్డి,పేట జ్ఞానేందర్ రెడ్డి

## జాతీయచేనేత ఐక్యవేదిక......

### రాష్ట్ర అధికార ప్రతినిధిగా పోలిశెట్టి సురేంద్ర



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: అన్నమయ్య జిల్లా పీలేరు జాతీయ చేనేత ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారప్రతినిధిగా పీలేరు నియోజ వర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర నియామకమయ్యారు ఈ సందర్భం గా మాట్లాడుతూ కార్మికుల పరిరక్షణ కోసం వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు ఈ సందర్భంగా పట్టణంలో ప్రముఖులు ఆయనను అభినందించారు.

## అంగన్ వాడి కేంద్రాలకు.....

### ఒంటిపూట బడులు



సదుం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 19: సదుంమండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు మార్చి 18 నుంచి మే నెల 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు ఇన్చార్జి సిడిపిఓ మల్లీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 20.3 2025 నుంచి 22. 0 3. 25వ తేదీ వరకు అంగన్వాడి కార్యకర్తలకు 3 రోజులపాటు పోషణ భి , పడాయి బి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.సదుం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:00 వరకు పోషణ బి పడాయి బి పై శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఒక్క అంగన్ వాడి కార్యకర్తలు హాజరవ్వాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆంధ్రబాడీ బిల్డింగ్ పోటీలలో ....

### సత్తా చాటిన కుప్పం చెందిన మణి

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 19: ఇటీవల తిరుపతి జిల్లా లోని సూళూరుపేట లో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ ఛాంపియన్ షిప్ 75 కెజి విభాగంలో కుప్పం కు చెందిన మణి ఛాంపియన్ షిప్ సాధించాడు. దీనిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అడ్వైసర్ మహేష్ మాట్లాడుతూ ఎవరి ప్రొఫాషనల్ ట్రైనింగ్ లేకుండా స్వయంగా మూడు సంవత్సరాలు కష్టపడి ఈ ఘనత సాధించడం యువకులకు స్ఫూర్తి గా నిలవడం ఎంతో అభినందనీయం అని తెలిపారు . అదే విదంగా బాడీబిల్డర్ మణి మాట్లాడుతూ ప్రభుత్వం కూడ బాడీబిల్డింగ్ ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ప్రసాద్, డైరెక్టర్ సెల్వం ,బాడీ బిల్డర్స్ మరియు యువకులు పాల్గొన్నారు




# యల్లమ్మ తల్లికి 25వ రోజు అభిషేక పూజలు





కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: పులిచెర్ల మండలం పులిచెర్ల గ్రామ పరిధిలోని ఇలవేల్పు దేవత యల్లమ్మ తల్లి కి మండలి పూజలో భాగంగా 25వ రోజు అభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గోటూరి మురళి మోహన్ రెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు.25వ రోజు అభిషేక పూజ కార్యక్ర మాలు ఉభయదారులు చీమలమర్రి గురు స్వామి, అరుణ దంపతులు, హరిత,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్య క్రమానికి ముఖ్య అతిథులు వల్లివేడు విక్రమ్ రెడ్డి,రాయల్ మోహన్, నాగయ్య, ప్రభాకర్,రమణారెడ్డి,యల్లారెడ్డి,రామ్ కుమార్ రెడ్డి,రెడ్డి భాష తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


# ప్రొహిబిషన్ శాఖ అధికారులపై కమిషన్ ఫిర్యాదు


పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: పలమనేరు ప్రొహిబిషన్ శాఖ పై సమాచార హక్కు చట్టం సమితి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి టీ మునిరత్నం బుధవారం గుంటూరు కమిషన్ ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు సమాచారం ఇవ్వకుండా తుంగలో తొక్కారు 65 రోజుల పైబడిన కనీసం దరఖాస్తుకు పత్యుత్తరములకు నోచుకోని పరిస్థితుల్లో అధికారులు ఉండ డం పై సమాచార హక్కు చట్టం ఉద్యమ కారులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సమాచారం దరఖాస్తుకు ఒక్క రోజు సమాచారం ఇవ్వమంటే, అలాగే 17 అంశములు చెందిన సమాచార వివరాలు తెలపమంటే, తేల ముఖమేశారు. నిర్లక్ష్యం గా చట్టాన్ని తూట్లు పొడిచారు. నిబంధనల ను ఉల్లంఘించారు.దీంతో బాధితుడు సమాచార హక్కు చట్టం దరఖాస్తు దారుని పట్ల అనుచితంగా వ్యవహరించడం జరిగింది. సమాచార హక్కు చట్టాన్ని కాల రాసిన పలమనేరు ప్రొహిబిషన్ ప్రజా సమాచార మరియు అప్పిలేటు అధికారు లపై గుంటూరు కమిషన్ అధికారులపై చర్యలు నిమిత్తం ఆశ్రయించారు. సమా చార హక్కు చట్టం సెక్షన్ 19 (3) ప్రకారం, అలాగే 20 (1) కమిషన్ కు కోరినట్లు దరఖాస్తుదారుడు తెలియజేశారు.



# పేదల భూమిని పరిరక్షించండి రైతు ఆవేదన







కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: పేదల భూమిని పరిరక్షించాల్సిన అధికారులే అక్రమణదారులకు సహకరించడం బాధాకరమని కుప్పం మండలం పైపాల్యం గ్రామానికి చెందిన రైతు ఆరోపిస్తున్నారు. తమ గ్రామ పంచాయతీ పరిధిలో దశాబ్దాల కాలం నాటి క్రితమే తామ తండ్రి వేరొకరి వద్ద కొంత పొలం కొనడం జరిగిందని, అయితే గతంలో ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భాగంగా తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా రీ సర్వే నిర్వహించి 65 సెంట్లు మిగులు భూమిని గుర్తించడం జరిగిందన్నారు. ఈ భూమి సైతం తమకు భూమి విక్రయించిన వారి పేరు మీద ఉందని, ఈ భూమి తమకే చెందుతుందని, అయితే తమ గ్రామ రెవెన్యూ సిబ్బంది అక్రమంగా తమ పంచాయితీకి సంబంధం లేని వ్యక్తుల పేర్లపై మిగులు భూమిని రికార్డులలో నమోదు చేసినట్టు ఆరోపించారు. ఈ విషయమై ఇదివరకే జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలవడం జరిగిందని, వారి సూచనల మేరకు కుప్పం ఆర్డీవోని సంప్రదించినట్లు తెలిపారు. ఆయన విచారణ జరుపుతున్న సమయంలో తప్పు చేసిన సంబంధిత అధికారి బెదిరింపులకు పాల్పడడంతో తన తండ్రి గుండె నొప్పి తెచ్చుకుని పి ఈ ఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణం విడిచినట్లు తెలిపారు. తమ ఆస్తులు నష్టపోవడానికి తన తండ్రి ప్రాణం పోవడానికి కారకులైన వారిపై తగు విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన .....

# ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పీఎస్ మునిరత్నం




కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: కుప్పం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిరుపేద చిరు వ్యాపారుల సంఘ సభ్యుడు వేలు కుటుంబ సభ్యులకు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం సీఎం రిలీఫ్ ఫండ్ 6లక్షల 40 రూపాయల చెక్కును బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ వైద్యం శాంతారాం, జనసేన అధ్యక్షులు నరేష్ క్లస్టర్ ఇంచార్జ్ సత్యేంద్ర శేఖర్,అనసూయ చిరువ్యాపారుల సంఘంఅధ్యక్షులు ఎం మంజునాథ్, చిరు వ్యాపారుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వెంటాడుతున్న పాపాలు

తిరుపతి : సరిగ్గా రెండేళ్ల క్రితం జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. ఆరోజే వైసీపీ ఓటమి ఖరారయింది. 2022 జులై లేదా ఆగస్టు నెలలో నలుగురైదుగురితో ఒక కీలక మీటింగ్ .. నాకు సన్నిహితుడైన ఒక అన్న నువ్వు కచ్చితంగా రావాలి అని తీసుకెళ్లాడు.. 2023 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మీద చర్చ నడిచింది.. అధికారపార్టీ పరిస్థితి బాగాలేదు అని అందరి అభిప్రాయం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగులుతుందని తేల్చి చెప్పారు.. ఆ కీలక నేత మాత్రం సర్లే చూద్దాం అంటూనే అయినా ఏమవుతుందిలే అనేశారు. ఈ మీటింగ్ జరిగిన రెండు నెలల తరువాత ఊహించని అభ్యర్థి ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలోకి వచ్చారు..పశ్చిమ రాయలసీమ మరియు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇద్దరూ నాకు సన్నిహితులే. రాజధాని పనులను సొంత ప్లానింగ్ తోనే... మరోవైపు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రచారం మీద మంచి రిపోర్ట్ అందుతుంది.. మంచి ప్లానింగ్ ,ఓట్ల ఎన్ రోల్ మెంట్ , ప్రతి మండల కేంద్రంలో ఆయన టీమ్ తరుపున మీటింగులు పెట్టడం .. పని బాగుంది.. ఎక్కడ కూడా టీడీపీ పెద్ద స్థాయి నాయకుల మీద ఆధారపడకుండా ఆయన టీమ్ పనిచేసుకుంటూ వెళ్తుంది..

## సదరం క్యాంపు ....

## సద్వినియోగం చేసుకోండి.

### ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 19: కుప్పం ఏరియా ఆసుపత్రిలో మార్చి 21, 22వ తేదీలలో నిర్వహిస్తున్న సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం స్పష్టం చేశారు. కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మాట్లాడుతూ.. పెన్షన్ కోసం వృద్ధులు దివ్యాంగులకు సదరం క్యాంపులో పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కుప్పం లబ్ధిదారులు నేరుగా క్యాంపుకు హాజరై పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. సదరం ధ్రువ పత్రం పొందదలచిన వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు ఒరిజినల్ మరియు పూర్వపు హాస్పిటల్ రిపోర్ట్ 4 తీసుకురావాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# లయోలాకు అటానమస్ రద్దు...

విజయవాడ : విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అటానమస్ హోదాను కృష్ణా యూనివర్శిటీ రద్దు చేసింది. కృష్ణా యూనివర్శిటీ నియమించిన కమిటీ విచారణలో పలు లోపాలను గుర్తించడంతో అటానమస్ హోదాను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. లయోలా కాలేజీలో అకడమిక్, ఎగ్జామినేషన్స్, ఫైనాన్షియల్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలపై కృష్ణా యూనివర్శిటీ కొద్ది నెలల క్రితం విచారణకు ఆదేశించింది. కమిటీ దర్యాప్తులో పలు ఉల్లంఘనలు గుర్తించారు.యూజీసీ నియమనిబంధనలు ఉల్లంఘించినట్టు తేలడంతో ఆంధ్రా లయోలా కాలేజీ స్వతంత్ర హోదాను రద్దు చేసి కృష్ణా యూనివర్శిటీ అనుబంధ కళాశాలగా పరిగణించనున్నట్టు పేర్కొన్నారు.ఆంధ్రా లయోలా కాలేజీకి సంబంధించిన అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, కోర్సులు, ఫీజుల వివరాలు, పరీక్షలకు సంబంధించిన డాక్యుమెంట్స్, సర్టిఫికెట్స్‌లను పది రోజుల్లో యూనివర్శిటీకి అప్పగించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిగిలిన అఫిలియేటెడ్ కాలేజీలతో పాటు విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు.విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అటానమస్ హోదాను రద్దు చేయడానికి యూజీసీ నియమ నిబంధనలు పాటించకపోవడం కారణంగా చెబుతున్నా అసలు కారణం మాత్రం కాలేజీ ప్రాంగణంలోకి వాకర్లను అనుమతించ పోవడంగా తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా లయోలా కాలేజీ ప్రాంగణంలోకి వాకర్లను అనుమతించాలంటూ స్థానికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇందుకు కాలేజీ యాజమాన్యం నిరాకరిస్తోంది.ఈ వివాదంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిలో రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు కూడా చేసింది. సమీపంలో ఉన్న ప్రభుత్వ కాలేజీల్లో కాకుండా ప్రైవేట్ కాలేజీ స్థలంలో వాకింగ్ కోసం పట్టుబడుతున్నారని లయోలా అభ్యంతరం తెలిపింది.నగరం మధ్యలో ఉన్న ఆంధ్రా లయోలా కాలేజీలో వాకింగ్ చేయడానికి అనుమతి కోసం వాకర్ సంఘాలు కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నాయి. సున్నితమైన ఈ వ్యవహారంలో ప్రభుత్వం నెలల తరబడి ఉదాసీనంగా వ్యవహరించడంతో ఇది కాస్త రాజకీయ రగడగా మారింది. నగరం మధ్యలో ఉన్న ఈ కాలేజీ దాదాపు 100ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది.1950వ దశకంలో మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం అవతరించే సమయంలో లయోలా కాలేజీకి అంకురార్పణ జరిగింది. ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటైన ఈ విద్య సంస్థ ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. క్యాథలిక్ మైనార్టీ విద్యా సంస్థగా.. జెస్యూట్ మిషనరీల ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా నడుస్తున్న లయోలా అనుబంధ సంస్థల్లో ఆంధ్రా లయోలా కాలేజీ ఒకటి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం మద్రాసు వెళ్లాల్సిన రోజుల్లో విజయవాడ కేంద్రంగా తెలుగు ప్రజల కోసం ఈ కాలేజీని ఏర్పాటు చేశారు. అప్పట్లో విద్య ప్రాధాన్యతను గుర్తించిన విజయవాడ నగరానికి చెందిన ప్రముఖులు, భూస్వాములు ఈ సంస్థకు భూములను సేకరించడానికి సహకరించారు. కాలేజీ నిర్మాణానికి దేశవిదేశాల నుంచి ఎంతోమంది దాతలు ఉదారంగా విరాళాలు ఇచ్చారు.ఒకప్పుడు విజయవాడ నగరానికి దూరంగా ఉన్న లయోలా కాలేజీ పట్టణీకరణ నేపథ్యంలో ప్రస్తుతం విజయవాడ నగరం మధ్యలోకి చేరింది. చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై దాదాపు 100ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాలేజీలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, సాంస్కృతిక కేంద్రాలు ఉన్నాయి. అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే కేంద్రం కూడా ఉంది. కాలేజీ ఆవరణలో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు వేర్వేరుగా హాస్టళ్లు ఉన్నాయి. డిగ్రీ, పీజీ విద్యార్థినులకు కూడా హాస్టళ్లు ఉన్నాయి. విద్యార్థినుల భద్రతా కోణంలో కూడా లయోలా వాకర్ల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తోంది.కాలేజీ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానిక ప్రజలు కొన్నేళ్లుగా కాలేజీ ప్రాంగణంలో వాకింగ్ చేస్తున్నారు. మొదట్లో పదుల సంఖ్యలో ఉన్న వాకర్లు ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకున్నారు. కోవిడ్ 19 ప్రబలిన తర్వాత కాలేజీ ప్రాంగణంలో వాకింగ్ చేయడంపై కాలేజీ యాజమాన్యం ఆంక్షలు విధించింది.వాకింగ్‌కు అనుమతించకపోవడంతో వాకర్ అసోసియేషన్లు? పోలీసులకు, ప్రభుత్వ శాఖలకు, స్థానిక రాజకీయ నాయకులకు ఫిర్యాదు చేయడంతో కాలేజీలో వాకింగ్ చేయడానికి అనుమతించాలని తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనట్టు లయోలా గతంలో ఆరోపించింది.






# 100 కోట్ల ఖరీదైన ఇల్లు

ఈ మధ్య సినిమాలు బాగా తగ్గించింది అగ్ర కథానాయిక నయనతార. ప్రస్తుతానికైతే కుటుంబం కోసమే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నది. దాదాపు 15ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నయనతార భాగమైంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో ప్రేక్షకులకు చేరువైంది. ఈ క్రమంలో తన సమకాలీన కథానాయికల కంటే నయనతార భారీ మొత్తంలో డబ్బును ఆర్జించిందని చెబుతారు. తాజాగా ఆమె 100కోట్లతో చెన్నైలో ఓ విలాసవంతమైన గృహాన్ని కొనుగోలు చేసింది. చెన్నైలో ప్రముఖులు ఉండే పోయెస్ గార్డెన్‌లో భర్త విఘ్నేష్ శివన్‌తో కలిసి ఆమె ఈ ప్రాపర్టీ కొనుగోలు చేసిందని తెలిసింది. దాదాపు మూడంతస్తులు ఉన్న ఈ భవనంలో మొదటి ఫ్లోర్ మొత్తం స్టూడియో కోసం కేటాయించారట. మిగతా రెండు ఫ్లోర్‌లలో అధునాతన సౌకర్యాల తో విలాసవంతంగా ఇంటిని సిద్ధం చేశారట. ఇంటీరియర్ డిజైన్స్‌కే పెద్ద మొత్తంలో వెచ్చించారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ ఇంటికి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'

ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకుడు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకను ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాలా మంది టైటిల్ పాజిటివ్‌గా ఉందని చెప్పారని, ప్రేక్షకులకు విభిన్న కథా చిత్రాన్ని చూసిన అనుభూతిని మిగుల్చుతుందని హీరో ఆది సాయికుమార్ తెలిపారు. తన డ్రీమ్ ప్రాజెక్ట్ ఇదని, ఫ్యామిలీ అంతా కలిసి చూసే డివోషనల్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని, రవి బస్రూర్ సంగీతం హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు షణ్ముగం సాప్పని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: తులసీరామ్, షణ్ముగం, రమేష్ యాదవ్, దర్శకత్వం: షణ్ముగం సాప్పని.




# ఐపీఎల్ ప్రారంభోత్సవానికి అంతా సిద్ధం..



ధనాధన్ టోర్నీ ఐపీఎల్ మార్చి 22 నుండి ప్రారంభం కానుందనే విషయం తెలిసిందే. మార్చి 22న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా డిపెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సీజన్‌లో ప్రతి జట్టు కూడా టైటిల్ విజేతే కావాలని కసితో ప్రాక్టీస్ చేస్తున్నాయి. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు, ప్రతి సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కూడా, ఐపీఎల్ నిర్వాహకులు ప్రారంభ వేడుకను నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఐపీఎల్ ప్రారంభోత్సవంలో ఏ ప్రముఖులు ప్రదర్శన ఇస్తారనే దానిపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఐపీఎల్ ఎడిషన్ ప్రారంభానికి ముందు బీసీసీఐ గ్రాండ్‌గా నిర్వహించే వేడుకకి ఏయే సెలబ్రిటీలు హాజరవుతారనే ఆసక్తి అందరిలో ఉంది. శ్రద్ధా కపూర్, వరుణ్ ధావన్ ఓపెనింగ్ సెర్మనీ వేడుకులో డ్యాన్స్ చేయనున్నారట. ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీలో హీట్ పుట్టించే ఈ జంట.. ఐపీఎల్ నైట్‌లో ఉర్రూతలూగించడం ఖాయం అని ఫ్యాన్స్ లెక్కలు వేసుకుంటున్నారు. ఇక వీరికి తోడు పాపులర్ సింగర్ అరిజిత్ సింగ్, శ్రేయ ఘోషాల్, పంజాబీ గాయకుడు కరణ్ ఔజ్లా తమ పాటలతో యూత్‌ను మైమరపింపజేస్తారని చెబుతున్నారు. ఇంకొందరు బాలీవుడ్ నటీనటులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ స్టార్ ప్రదర్శనలతో పాటు, అనేక ఇతర కార్యక్రమాలు కూడా అట్టహాసంగా నిర్వహించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేస్తుంది. ఇక ఇదిలా ఉంటే మార్చి 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. మే 25న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటి వరకు ముంబై, చెన్నై జట్లు అత్యధికంగా చెరో ఐదు సార్లు విజేతలుగా నిలవగా, వాటి తరువాత మూడు సార్లు కోల్‌కతా నైట్ రైడర్స్ ఐపీఎల్ ట్రోఫీని అందుకుంది. ఇక పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ వంటి జట్లుకు ఐపీఎల్ ట్రోఫీ చేతికొచ్చినట్టే వచ్చి చేజారితపోతుంది. ఈ సారైన వారు ట్రోఫీని అందుకుంటారా అనేది చూడాలి

# షారుఖ్ ఖాన్‌తో సుకుమార్ సినిమా.?



పుష్ప ది రూల్ సినిమాతో నేషన్ వైడ్ బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు సుకుమార్ అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం సుకుమార్ ఎవరితో సినిమా చేయబోతున్నాడా అని మూవీ లవర్స్ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ సినీ వర్గాల ప్రకారం సుకుమార్ తన నెక్ట్స్ ప్రాజెక్ట్ రామ్ చరణ్‌తో '%=జ% 17' చేస్తాడని అంటుండగా.. మరోవైపు 'పుష్ప 3' కథ రాసే పనిలో ఉన్నడని టాక్ వినిపిస్తుంది. ఇదిలావుంటే.. ఈ రెండు కాకుండా మరో క్రేజీ పాన్ ఇండియా కాంబో తెరమీదకు వచ్చింది. **బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్, దర్శకుడు సుకుమార్ కలిసి ఒక ప్రాజెక్ట్ చేయబోతున్నారని ప్రస్తుతం వార్తలు** వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు కలిసి ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కోసం చేతులు కలపబోతున్నట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే సుకుమార్ పేరు బాలీవుడ్‌లో మారుమోగడం ఖాయం. రూరల్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథతో ఈ సినిమా రాబోతుండగా.. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌ను విలన్ పాత్రలో చూపించే ఆలోచనలో సుకుమార్ ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఒక్క సినిమాతో బుల్లిరాజు క్రేజ్ మరింత పెరిగిందిగా..

# సీనియర్ ఆర్టిస్ట్‌ల రేంజ్‌లో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నాడే.!

కొద్ది రోజుల క్రితం వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల బుల్లితెరపై సందడి చేసిన ఈ మూవీకి మంచి టీఆర్పీ కూడా వచ్చింది. ఇందుల ప్రతి ఒక్కరు తమ తమ పాత్రలతో అదరగొట్టేశారు. అయితే సినిమాలో వెంకటేష్ కుమారుడిగా నటిచిన బుల్లిరాజు తన నటన, డిక్షన్‌తో ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాడు. సినిమా రిలీజ్ అయిన రోజు నుండి బుల్లిరాజుపై ప్రశంసల వర్షం కురుస్తూనే ఉంది. అతనే సెంట్రాఫ్ అట్రాక్షన్‌గా మారాడు. బుల్లిరాజుతో చాలా ప్రమోషన్స్ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సంక్రాంతికి వస్తున్న చిత్రం మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు కుటుంబ కథా చిత్రంగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇందులో బుల్లిరాజు బూతులు తిడుతూ తెగ నవ్విస్తుంటారు. అయితే బుల్లిరాజు అలా బూతులు తిట్టడానికి కారణం ఓటీటీలు చూసి చెడిపోవడమే అని వెంకీ చిత్రంలో చెప్పుకొస్తాడు. ఏది ఏమైన తొలి సినిమాతో బుల్లిరాజుకి మంచి పేరు రావడంతో పాటు డిమాండ్ కూడా అమాంతం పెరిగింది. దీంతో సీనియర్ స్టార్స్ రేంజ్‌లో బుల్లి రాజు తన రెమ్యునరేషన్ పెంచినట్టు టాక్ వినిపిస్తుంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, బుల్లి రాజు ఒక రోజుకు ఏకంగా లక్ష రూపాయల రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తున్నట్టు టాక్ వినిపిస్తుంది. గతంలో ఎప్పుడు కూడా చిన్న పిల్లలకి ఇంత రెమ్యునరేషన్ ఇచ్చింది లేదు. కాని సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో అతని పర్‌ఫార్మెన్స్‌కి మెచ్చి నిర్మాతలు కూడా అంత మొత్తం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో ఆఫర్ అందిపుచ్చుకుంటున్నాడు బుల్లిరాజు. అతను నెలలో పది రోజులు కాల్షీట్స్ ఇచ్చాడంటే 10 లక్షలు. నేటితరం సీనియర్ ఆర్టిస్టులు కొందరు ఇదే రేంజ్ రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు. ఇక చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న భారీ చిత్రంలో, బుల్లి రాజు కోసం ఓ ప్రత్యేకమైన పాత్రను డిజైన్ చేసినట్టు ప్రచారం జరుగుతుంది. ఇందులో కూడా బుల్లిరాజు పాత్ర పేలింది అంటే మనోడికి ఇక తిరుగు ఉండదు అని చెప్పాలి



OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036